www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 15 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 6

## తెలంగాణ సాయుధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి



- ఇది ప్రపంచ చరిత్రలో మహోన్నత ఘట్టం
-విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

2 లో

# సమ్మెలో కార్మికులు.. వంట, వడ్డెనలో ఉపాధ్యాయులు

### కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాల కార్మికుల సమ్మె





# బంద్‌కు సిద్ధమైన ఉన్నత విద్యాసంస్థలు..!


### వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణలో వృత్తి విద్యా కళాశాలలు మరోసారి ఆందోళనకు సిద్ధమయ్యారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే సెప్టెంబర్ 15న సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధికంగా కళాశాలలు మూసివేస్తామని తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల ఫెడరేషన్ ప్రకటించింది. ఇంజనీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ, ఫార్మసీ, నర్సింగ్ లతో పాటు అన్ని ప్రొఫెషనల్, డిగ్రీ,

మిగతా 2లో..

# ఆగని మైక్రో ఫైనాన్స్ దందా..!



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, గుట్ట మల్లారం, బయ్యారం, ఎల్చిరెడ్డిపల్లి, పినపాక, కరకగూడెం మండలాల్లో మైక్రోఫైనాన్స్ పేరుతో వడ్డీ వ్యాపారం చెలరేగిపోతోంది. పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ కంపెనీలు అధిక వడ్డీలతో రుణాలు ఇస్తూ నిరుపేదలను బారిన పడేస్తున్నాయి.

### రహస్యంగా దందా...

షెడ్యూల్ ఏరియా మణుగూరు లోని గుట్ట మల్లారం పంచాయితీ పరిధిలో ముంబై రిజిస్ట్రేషన్ తో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ పేరుతో ఒక గది అద్దెకు తీసుకొని,

### రోజు వారి కూలీలే లక్ష్యం
### గ్రూప్‌ల ఏర్పాటు...
### ఇన్సూరెన్స్ పేరులో మరో దోపిడీ

కొందరు యువకులను సిబ్బందిగా పెట్టుకొని రహస్యంగా కార్యకలాపాలు సాగిస్తు న్నారు. గిరిజన పల్లెలను ప్రత్యేకంగా టార్గెట్ చేస్తూ గ్రామాల్లో పది మంది మహిళలను ఒక గ్రూప్ గా చేసి ఒక్కొక్కిరికి 50 వేల వరకు రుణాలు ఇస్తున్నారు. ఆ గ్రూపు లో ఉన్న పది మంది కూడా ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ఒక్కొక్క ఇన్సూరెన్స్

మిగతా 2లో..

# సామాన్యులను సాయుధులను చేసిన పోరాటం

### -భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన మహత్తర పోరాటం
### -తెలంగాణ వారోత్సవ సభలో బాగం



2 లో



# సమ్మెలో కార్మికులు.. వంట, వడ్డెనలో ఉపాధ్యాయులు

**ప్రజాపక్షం/ ఖమ్మం/ కల్లూరు :** ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కార్మికులు గడిచిన మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఒక పక్క కార్మికులు సమ్మె చేస్తుంటే మరో పక్క ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు వంట, వడ్డెన కార్యక్రమాల్లో ఉన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 18 ఆశ్రమ పాఠశాలల్లోపనిచేస్తున్న కార్మికులు తమకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, నెలకు రూ. 26 వేలు చెల్లించడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అన్నింటికి మించి ఉద్యోగ భద్రత కల్పించాలని, గెజిట్ ప్రకారం వేతనాలను అందించాలని డిమాండ్స్ చేస్తూ సాగుతున్న ఈ సమ్మెలో కార్మికులు పాల్గొంటున్నారు. కార్మికుల సమ్మె కారణంగా ఆశ్రమ పాఠశాలల్లో పారిశుధ్యంతో పాటు వంట సమస్య తలెత్తింది. పిల్లలు ఇబ్బంది పడకూడదని ఉపాధ్యాయులే వంట, వడ్డెన కార్యక్రమాల్లో ఉన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వండి వడ్డించే పనిలో ఉండడంతో బోధనకు ఇబ్బంది కలుగుతుంది. ప్రభుత్వం సమస్యను సానుకూలంగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్య పనులు లేకపోతే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో ఉపాధ్యాయులు వంట, వడ్డెనలో ఉంటే బోధన సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. తక్షణం సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# బంద్‌కు సిద్ధమైన ఉన్నత విద్యాసంస్థలు..!

(మొదటిపేజీ తరువాయి)

పిజి కళాశాలలు కూడా ఈ బంద్‌లో భాగం కానున్నాయి. మొదట ఉన్నత విద్యా సంస్థలు బంద్‌కు సిద్ధం కాగా వాటితో పాటు ఇంటర్, డిగ్రీ కళాశాలలు తమ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి గత ఐదేండ్లుగా పేరుకుపోయిన రూ. 8వేల కోట్ల బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు నిరసనకు సిద్ధమయ్యాయి. గతేడాది ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి రూ. 1200 కోట్లు టోకెన్లు జారీ చేసినప్పటికీ ఆ నిధులు విడుదల కాలేదని కళాశాల యజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారుతుందని అప్పులు పెరిగిపోతున్నాయని బోధన సిబ్బంది, ఇతర ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేకపోతున్నామని కళాశాల యజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళన కొనసాగిస్తామని యజమాన్యాలు తెలిపాయి. తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల ఫెడరేషన్ బాధ్యులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌రెడ్డి శనివారం చర్చలు జరిపినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయింది. మరోమారు ఆదివారం చర్చలు జరపనున్నారు. చర్చలు సఫలం కాకపోతే ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటించ నున్నాయి. దీనికి సంబంధించి ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన విద్యా సంస్థల యజమాన్యాలు సమావేశం నిర్వహించారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. మంగళవారం ధర్నాచౌక్ నందు యజమాన్యాలు, అధ్యాపకులు నిరసన దీక్ష చేపట్టనున్నారు.

**బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు :**

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించే బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం చీకట్లోకి నెట్టివేస్తుందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ. 8,200 కోట్లు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉండడం వల్ల కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. బంద్‌లో భాగంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో నిర్వహించే మహా ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. బంద్‌కు మద్దతుగా విద్యార్థులు, తల్లిదండ్రులు ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, వంగూరి వెంకటేష్, తుడుం ప్రవీణ్, గోకినేపల్లి మస్తాన్, మందా సురేష్, శివ, వంశీ, లోకేష్, స్టాలిన్, వెంకటేష్, అజయ్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగని మైక్రో ఫైనాన్స్ దందా..!

(మొదటిపేజీ తరువాయి)

2000 రూపాయాలు తీసుకుంటున్నారు. ఇంతేకాక లోన్ ప్రాసెస్ చేసినందుకు ఒక్కొక్కరికి 1000 నుంచి 1500 వరకు తీసుకుంటున్నారు. ఈ విధంగా షెడ్యూల్ ఏరియాలో గిరిజన గ్రామాల్లోని మహిళలే టార్గెట్‌గా చేసుకొని కొన్ని వందల గ్రూపులు ఏర్పాటు చేసి కోట్ల రూపాయల లావాదేవీలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం కళ్ళుమూసుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అడ్డగోలుగా వసూళ్లు...**

రోజువారీ కూలీలు, నిరక్షరాస్యులను వాడుకొని నూటికి 5, 10 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. రుణం మంజూరు చేసే సమయంలో డాక్యుమెంట్ చార్జీలు, ఇన్సూరెన్స్ పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారు. వాయిదాలు ఆలస్యమైతే ఇంటి గడప దాటి బలవంతపు వసూళ్లకు కూడా దిగిపోతున్నారు.

**భయంతో బతుకులు..**

"రోజూ చేసేది కూలి అంతా వడ్డీలకే పోతోంది. పిల్లల భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతోంది అని ఒక మహిళ వాపోయింది "ఇంట్లోకి చొరబడి వసూళ్లు చేస్తున్నారు. పరువు ప్రతిష్టలను పణంగా పెడుతున్నారు" అని ఒక కూలీ ఆవేదన వ్యక్తం చేశాడు. చిరు వ్యాపారులు, కూలీలు, గిరిజనులు భయాందోళనలో జీవనం సాగిస్తున్నారు. అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులుచేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

**జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి....**

గిరిజన పల్లెల్లో విచ్చలవిడిగా సాగుతున్న మైక్రోఫైనాన్స్ దందా పేదల జీవనాన్ని కుదిపేస్తోంది. వడ్డీ వ్యాపారుల అనివేతలతో అమాయకుల ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు అధికారు తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక మనీ లెండర్స్ యాక్ట్ ప్రకారం కూడా, లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నడపడం నేరం. అదే విధంగా ఆర్బిఐ మార్గదర్శ కాలు ప్రకారం మైక్రోఫైనాన్స్ సంస్థలు షెడ్యూల్ ఏరియాలలో ప్రత్యేక అనుమతి లేకుండా రుణాలు మంజూరు చేయరాదు. అయినా కూడా ప్రైవేట్ కంపెనీలు "ఫైనాన్స్ సొసైటీలు" "మైక్రోఫైనాన్స్ గ్రూపులు" అనే పేర్లతో గిరిజన ప్రాంతాల్లో దందా సాగించడం చట్టానికి విరుద్ధమే. ఇలాంటి కంపెనీలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, మేధావులు కోరుతున్నారు.

## డిపిఎం యూనిట్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నామ రఘురాం

**ప్రజాపక్షం/కల్లూరు:** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న డిస్టిక్ ప్రోగ్రామింగ్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఖమ్మం జిల్లా కల్లూరూ మండలం చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన నామ రఘురాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ లో జరిగిన డిస్టిక్ ప్రోగ్రామింగ్ యూనిటీ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలో రఘురామును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 2018 వ సంవత్సరంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైజర్ గా నియమితులైన రఘురాం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని, అందరిని కలుపుకునే ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.



### తెలంగాణ సాయుధ పోరాటం

# ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి అని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని స్వతంత్ర భారత దేశంలో అనేక ప్రజా,కార్మిక పోరాటాలు జరిగాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని 17వ వార్డు న్యూ గొల్లగూడెంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. జమీదారీ వ్యవస్థ, దోపిడి, అన్యాయాలపై పేదరైతులు, కూలీలు ఏకమై పోరాడిన ఉద్యమమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని, ఇలాంటి మహత్తర పోరాటాన్ని కేంద్రంలోని మోడి సర్కార్ హైజాగ్ చేసే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ పోరాటంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగదళ్ పాత్ర ముమ్మాటికీ శూన్యమన్నారు. ప్రజా కార్మిక హక్కులు, సామాజిక న్యాయం కోసం నేడు జరుగుతున్న పోరాటాలకు తెలంగాణ సాయుధ పోరాటం ఆదర్శమని, నాటి పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ భవిష్యత్ తరాల్లో చైతన్యం నింపడమే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల బాధ్యత అన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిన సాయుధ పోరాటాన్ని విలీన దినోత్సవంగా ఎందుకు జరపలేకపోతున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆ నాటి పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, అమర వీరుల స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సాయుధ పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిలో నిలిచిపోయే విధంగా ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, మాజీ కౌన్సిలర్ కళ్యాణి, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, పురుషోత్తం, దుర్గ, అమన్, పుష్పలత, అస్మిత్, ముక్త్యార్, మల్లయ్య, పి రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులను సాయుధులను చేసిన పోరాటం

**ప్రజాపక్షం/ కొణిజర్ల :** సామాన్యులను సాయుధులను చేసిన మహత్తర పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. భూమి, భుక్తి, విముక్తితో పోటు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది యోధులు అమరులయ్యారని ఆయన తెలిపారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో సాయుధ తెలంగాణ పోరాట యోధుడు గడల సీతారామయ్య స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తెలంగాణకు రాలేదని నైజాం నవాబు సర్వ స్వతంత్రుడిగా ప్రకటించుకున్నాడని ప్రపంచంలోనే ధనిక రాజుగా ఉండి ఏడు తరాలు పాలించిన నైజాంపై తిరుగుబాటుకు కమ్యూనిస్టు పార్టీ పునుకుందన్నారు. బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దూం మోహినుద్దీన్‌ల పిలుపు మేరకు 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటం ప్రారంభమైందన్నారు. ఈ పోరాటంలో వందలాది గ్రామాలను విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడం జరిగిందన్నారు. సాయుధ పోరాటం తెలంగాణ జన జీవితంలో గొప్ప మార్పు తీసుకు వచ్చిందని ఆయన తెలిపారు. అమరుల త్యాగం, పోరాటం వృథా కాలేదన్నారు. కమ్యూనిస్టుల పోరాటం లేకుంటే భారతదేశపు నడి బొడ్డున తెలంగాణ మరో కశ్మీర్‌లా రగులుతూనే ఉండేదన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నిరంతర ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

**కొణిజర్లలో :**

సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కొణిజర్లలో సాయుధ పోరాటయోధుడు దొండపాటి వెంకయ్య స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ యోగుల త్యాగాలను నిరంతరం మననం చేసుకుని భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మతోన్మాద ఫాసిస్టు శక్తులు ఈ దేశాన్ని మైనార్టీ, మెజార్టీ ప్రతిపాదికన విభజించి పాలించడంతో పాటు చారిత్రిక సాయుధ పోరాటాన్ని సైతం మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, పోటు కళావతి, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, మండల నాయకులు స్వర్ణ రమేష్, మునిగ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు గడల సీతారామయ్య, యాసా శాంతకుమారి, సోమయ్య, తోటపల్లి సీతారాములు, ఎల్. గోపాలరావు, విష్ణుమూర్తి, సీతారాములు, బానోత్ రామయ్య, రాంబాబు, వెంకయ్య, అదపా బాబు, చింతల ఆదినారాయణ, యాసా కళావతి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం అమలు కాకుంటే ప్రజలు తిరగబడతారు



**ప్రజాపక్షం/ బోనకల్ :** రాజ్యాంగం బాగుండటమే గాక దాని అమలు కూడా కీలకమని ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలకుల పోకడలు ఉంటే తిరుగుబాటు తప్పదని పొరుగు దేశాల్లో జరుగుతున్న సంఘటనలే ఉదాహరణలు అని పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ అధ్యయనం సమావేశంలో పల్లా కొండలరావు మాట్లాడారు. రాజ్యాంగం మంచిదైతే సరిపోదని అమలు కూడా ముఖ్యమన్నారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్ లలో జరుగుతున్న సంఘటనలు, ప్రజలు ఎందుకు తిరుగుబాటు చేస్తున్నారో పాలకులు పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులు, ప్రజల మధ్య సంబంధాలు వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి ప్రయత్నాలు చేయకపోతే ఏ దేశంలోనైనా తిరుగుబాట్లు తప్పవని హెచ్చరించారు. భారతదేశంలో రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగ పర్చడం వంటి ప్రయత్నాలు ముదిరితే దేశ మనుగడకే ప్రమాదకరమన్నారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు, కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, బుర్గుల అప్పారావు, సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయండి

### -జాతీయ రహదారుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి కావడానికి మిగులు భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతిపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం దేవరపల్లి, నాగపూర్ అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం దేవరపల్లి రహదారికి ధంసలాపురం వద్ద ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల కొరకు 6.22 ఎకరాల భూ సేకరణ చేయాలన్నారు. అందులో 3.16 ఎకరాలకు ఇప్పటికే అవార్డు పాస్ చేసినట్లు, మిగిలిన 3.06 ఎకరాలకు భూ సేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. మేజర్ బ్రిడ్జి, వియుపిలు నవంబర్‌లోగా, ఆర్‌వోబి డిసెంబర్‌లోగా పూర్తి చేయాలన్నారు. కొదుమూరు వద్ద 400 కెవి ఈహెచ్‌టి షిఫ్టింగ్ పనులు రెవెన్యూ, విద్యుత్ శాఖాధికారులు సమావేశమై పూర్తి చేయాలన్నారు. నాగపూర్ అమరావతి ప్యాకేజీ 1, 2 భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ లోగా పరిహారం చెల్లింపు పూర్తి చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఎన్‌హెచ్‌ఏఐ పిడిలు రామాంజనేయ రెడ్డి, దివ్య, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టైలర్స్‌కు ఇచ్చిన ఇండ్ల స్థలాలకు రక్షణ కల్పించండి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టైలర్స్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాలకు రక్షణ కల్పించి ప్రభుత్వ హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఆవుల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవుల నాగేశ్వరరావు, యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని శ్రీనివాస నగర్‌లో సర్వే నెం. 303, 304లో 1999లో టైలరింగ్ వర్కర్స్ 108 మందికి అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్బన్ ఎంఆర్‌వో పట్టాలు ఇచ్చారని తెలిపారు. అట్టి స్థలంలో ఇండ్లు నిర్మించుకోవడానికి విద్యుత్, రహదారి, నీటి సౌకర్యం లేకపోవడంతో కొంత ఆలస్యమైందన్నారు. కొంత మంది ఎంతో ఖర్చు చేసి 30 ఇండ్లు నిర్మించుకున్నారని మిగిలిన వారు బేస్‌మెంట్లు నిర్మించుకున్నారని తెలిపారు. అట్టి ఇండ్ల స్థలాలతో ఎటువంటి సంబంధం లేని అమృతం శ్రీనివాస్ అనే వ్యక్తి అర్ధరాత్రి సమయంలో ప్రొక్లైన్‌తో కట్టిన ఇండ్లు, బేస్‌మెంట్లను కూల్చివేసి మట్టి పోశారని తెలిపారు. దీనికి సంబంధించి పోలీస్, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అమృతం శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అట్టి ఇండ్ల స్థలాలపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇట్టి విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని సహాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. జిల్లా అధికారులు విచారణ జరిపి ప్రభుత్వం ఇచ్చిన లే అవుట్ మ్యాప్ ఆధారంగా హద్దులు నిర్ణయించి మా ఇండ్ల స్థలాలు మాకు అప్పగించి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.ఈ సమావేశంలో సిహెచ్‌ఎం సుశీల, నర్సింహారావు, రచ్చా రామారావు, ఎంఎస్ కుమార్, కళావతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# రాజీవ్ స్వగృహకు సకల హంగులు..!

### - టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** హైదరాబాద్ గేటెడ్‌కమ్యూనిటీలకు ధీటుగా..రాజీవ్‌స్వగృహకు సకల సౌకర్యాలు,హంగులు కల్పిస్తున్నట్లు టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పోలేపల్లి వద్ద గల రాజీవ్‌స్వగృహలో ప్రభుత్వ ఉద్యోగుల హౌస్‌బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉద్యోగస్థుల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ఎన్నో ఎత్తుపల్లాలను దాటుకుంటూ టెండర్‌ను దక్కించుకున్నట్లు తెలిపారు. అతి తక్కువ ధరకే నాణ్యతతో కూడిన డబుల్, త్రిబుల్‌బెడ్‌రూం ఫ్లాట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. టీజీఓ హైట్స్ పేరుతో ప్రారంభించిన ప్రాజెక్టును సంవత్సరంలోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎస్‌బిఐ ద్వారా లోన్ సదుపాయం ఉందని, రూ.2లక్షలు టోకెన్ అమౌంట్ కట్టి ఫ్లాట్‌ను ఎలాట్ చేసుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పోలీస్ హోంగార్డులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను ఆహ్వానించి ప్రారంభం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్(జైపాల్), రాష్ట్ర నాయకులు ఎర్ర రమేష్, తాళ్లూరి శ్రీకాంత్, పెద్దినేని రాధాకృష్ణ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి కోణిదేన శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీఓహౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రటరీ విజయ్‌కుమార్, సభ్యులు శేష్‌ప్రసాద్, రాంబాబు, పుష్పరాజ్, మాధవరావు, వెల్పుల శ్రీను, వెంకేశ్వర్లు, పిఆర్‌టియు జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వైరా మండల పరిధిలోని రెబ్బవరం బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలను భూక్యా వీరభద్రం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సొంత భవనం లేక అరకొర వసతులతో చదువులు సక్రమంగా చదవలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనం నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మించాలని కోరారు. కాంట్రాక్టర్లు గురుకులాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని ఎలాంటి అవకతవలు లేకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతివారం గురుకులాలకు సంబంధించిన అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. విద్యార్థులతో మాట్లాడి వారు చెప్పిన సమస్యలను అక్కడి ప్రిన్సిపాల్ వార్డెన్, సంబంధించి వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. బాలికలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వారికి నిపుణులైన వైద్యులతో సకాలంలో వైద్య సౌకర్యాలు అందేవిధంగా చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి మెనూ ప్రకారం అన్ని అందించాలని సూచించారు. పేద విద్యార్థులు సక్రమంగా విద్య అందేవిధంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి రావాలని విద్యార్థినిలకు సూచించారు.

# ప్రశాంతంగా లైసెన్స్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం సెషన్‌లో నిర్వహించిన థియరీ పరీక్షకు 129 మంది అభ్యర్థులకు 128 మంది అభ్యర్థులు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్లాటింగ్ పరీక్షకు 205 మంది అభ్యర్థులకు గాను 202 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, సిపివో ఎ. శ్రీనివాసులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

# బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

**ప్రజాపక్షం/వైరా:** భారతీయ జనతా పార్టీ వైరా టౌన్ అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో సెప్టెంబర్17 నుండి అక్టోబర్2వ తారీఖ వరకు తలపెట్టిన సేవా పక్షం కార్యక్రమాల్లో భాగంగా సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కార్యదర్శి బండారు నరేష్ పాల్గొని కార్యక్రమాలు చేస్తూ ఎలా ముందుకు పోవాలి అనే విషయంపై అవగాహన కల్పిస్తూ ప్రతి కార్యకర్త బూత్ బలోపేతానికి కృషి చేయాలని, ప్రతి కార్యకర్త ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి.వెంకటేష్, వల్లెపు అనిల్, చింతనిప్పు రామారావు, తాటికొండ సంధ్య, తాతా ఆదినారాయణ, కూరగాయల దిలీప్, రంగు రమేష్, మద్దినేని సుభాష్, టి.వేణు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను విడుదల చేయండి

### -జేఏసి డిమాండ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పదవి విరమణ అనంతరం వచ్చే బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. జేఏసి సమావేశం ఆదివారం రిక్కాబజార్ హైస్కూల్‌లో సింగారపు జయరాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కమిటేషన్, గ్రాట్యూటి, న్యూ శాలరీ, జిఐఎస్, ఈఎల్ ఎన్ క్యాష్‌మెంట్స్, పిఆర్‌సి ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ప్రతినెల రూ. 700 కోట్లు పెండింగ్ బిల్లులకు చెల్లిస్తుందని వాటిలో ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రత్యేక కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దశల వారీగా ఆందోళనకు సిద్ధమవుతామని వారు తెలిపారు. ఈ సమావేశంలో రాంచందర్‌రావు, శాంతయ్య, ఆదినారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** తనికెళ్ల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థినిని ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. గ్రామానికి చెందిన మేకల కొమరయ్య అలివేలు దంపతుల కుమార్తె మేకల లావణ్య సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్రెడిట్ ఆఫీసర్‌గా నియామకమైంది. పదవ తరగతిలో తనికెళ్ల ఉన్నత పాఠశాలలో లావణ్యకు విద్య నేర్పిన గురువులు మాచినేని మధుసూదన్ రావు, రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు లావణ్యను సన్మానించి అభినందించారు. ఈ విజయం ఎంతో మంది బాలికలకు ప్రేరణ కలిగిస్తుందని గురువులు ఆకాంక్షించారు. లావణ్యను ప్రోత్సహించిన అక్క, బావ లను, తండ్రి లేకపోయిన కష్టపడి చదివించిన తల్లిని అభినందించారు.

# ఫాగింగ్, బ్లీచింగ్ మరిచిన అధికారులు

### గ్రామాల్లో దోమలు స్వైరవిహారం



**ప్రజాపక్షం/వైరా:** మండలంలోని 22 గ్రామ పంచాయ తీల్లో అనేక ప్రాంతాల్లో ప్రజలు దోమల బెడదతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నప్పటికి మురుగునీరు కారణంగా దోమలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయండి అంటూ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో మురుగునీరు పలుచోట్ల నిలిచిపోవడం వలన దోమలు వృద్ధి చెందుతున్నాయి. గృహాల మధ్య మురుగునీరు నిలిచిపోవడం పిచ్చి మొక్కలు పెరిగిపోయిన నేపధ్యంలో దోమల బెడద పెరిగిపోయింది. దోమలు నివారణకు గ్రామాల్లో అధికారులు ఫాగింగ్ చేయాల్సి ఉన్నప్పటికి ఎక్కడ ఫాగింగ్ చేయడం లేదు. కొన్ని చోట్ల అడపాదడపా ఎప్పుడో ఒకసారి ఫాగింగ్ చేసామా అనే విధంగా కనిపిస్తుంది. కొన్ని గ్రామపంచాయతీల్లో డ్రైనేజీలు కూడా సక్రమంగా పూడికతీయక నీరు నిల్వ ఉండి దుర్వాసన రావడంతో పాటు విష జ్వరాలు మొక్కలు వేపుగా పెరగడం డ్రైనేజీల్లో మొక్కలు పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా సాయంత్రం పూట సంచరిస్తున్నాయి. అసలే విషజ్వరాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల బ్లీచింగ్ కూడా చల్లిన పరిస్థితులు కనిపించడం లేదు. ఎక్కడన్నా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని ప్రతి గ్రామపంచాయతీలో ఫాగింగ్ చేపట్టి బ్లీచింగ్ చల్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌కు విశేష స్పందన

**- 4625 కేసులు పరిష్కారం : సిపి సునిల్‌దత్**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా వ్యాప్తంగా జాతీయలోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని వీటి ద్వారా 4625 కేసులు పరిష్కారం అయ్యాయని పోలీసు కమిషనర్ సునిల్ దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సైబర్‌క్రైం కేసుల్లో 52 లక్షలరూపాయలకు పైగా రిఫండ్ మొత్తాన్ని భాదితులకు అందజేయడం జరిగిందన్నారు. దీనిలో రాజీకి అవకాశం ఉన్న 712 ఎఫ్ఐఆర్ కేసులు, పెట్టి కేసులు 775, డ్రంక్అండ్‌డ్రైవ్ కేసులు 2972, మైనర్ డ్రైవింగ్ కేసులు 8, సైబర్ నేరాలపై నమోదైన కేసులు 158 లోక్‌అదాలత్‌లో పరిష్కారం అయ్యాయని వీటి ద్వారా రూ. 52,11,246 లక్షలు బాధితులకు అందజేయడం జరిగిందని వెల్లడించారు. రాజీమార్గం రాజమార్గమని, లోక్‌అదాలత్‌లో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్‌అదాలత్‌ను వినియోగించుకున్న కక్షిదారులు, సహకరించిన న్యాయవాదులు, న్యాయసేవాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రహ్మం గారి గుడి నిర్మాణానికి లక్ష విరాళం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పూసుగూడెం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం నిర్మాణం చేపడుతున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ వారి ఆర్థిక సహాయం కోరుతూ విజ్ఞప్తి మేరకు ఆలయ అభివృద్ధికి స్వర్గీయ తాండ్ర నారాయణ రావు కుమారులు ఎన్నారై తాండ్ర వెంకటేశ్వరరావు ఆదివారం లక్షల రూపాయల విరాళాన్ని ట్రస్ట్ కమిటీ సభ్యులు నరాటి ప్రసాద్, తాండ్ర బుచ్చిబాబు, కొదుమూరి పుల్లారావు చేతుల మీదుగా ఆలయ కమిటీ అధ్యక్షులు బండికట్ల ప్రభాకర్ చారీకి అందజేశారు. ఈసందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారు భవిష్యవాణి ద్వారా ఈ ప్రపంచంలో జరగబోతున్నటువంటి అనేక పరిణామాలను వారి జ్ఞాన దృష్టి ద్వారా సమాజానికి తెలియజేశారని, స్వార్థం లేని మనిషిగా జీవించి జీవ సమాధి కాబడిన శ్రీపోతూలూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ నిర్మాణం ములకలపల్లి మండలంలో చేపట్టడం అభినందనీయమని తాండ్ర వెంకటేశ్వరరావు తెలియజేసినట్లు ట్రస్ట్ బాధ్యులు నరాటి ప్రసాద్ తెలిపారు. లక్ష విరాళం అందించిన తాండ్ర వెంకటేశ్వరరావుకి ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కాపర్తి వెంకటాచారి, కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాసర్ల రామారావు, తాళ్ళపాయ మాజీ సర్పంచ్ బైటి రాజేష్, బైటి రాము, గ్రామస్తులు పేరసాని శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ చారి, పరిపూర్ణ చారి, పమ్మి వెంకన్న, బండికట్ల ప్రభాకర్‌చారి, రాఘవాచారి, వరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వారంతపు సెలవులు అమలు చేయాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రంలోని గల శాంతినగర్ ఆశ్రమ పాఠశాలలో దీక్ష మందిరంలో శాంతినగర్ హాస్టల్, కామేపల్లి హాస్టల్ సెల్ఫ్ మెనెజ్మెంట్ హాస్టల్ కారేపల్లి, మేకలతండా ఆశ్రమ పాఠశాల అందరూ దీక్ష శిబిరంలో 30 మంది కూర్చుకున్నారు. జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ దీక్ష మందిరంలో అఖిల భారత కార్మిక సంఘం ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్‌లో పని చేస్తున్న రైల్వే వర్కర్లను పర్మినెంట్ చేయాలని, జీవో 64 అమ్ములు నిలిపివేసి పాత పద్ధతిలోనే జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో పని చేస్తున్న డైలీ వేజ్ కామటి పార్ట్ టైం వర్కర్లకు గత 30 సంవత్సరాలుగా పైగా జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారు కానీ ఇప్పుడు 2021 జూన్ 15వ తేదీన బిఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవో 64 ప్రకారం వేతనాలు చెల్లించాలని మౌళిక ఆదేశాలు కల్పించారు. దాన్ని ఫలితంగా వేతనాలు బాగా తగ్గుతున్నాయని, కావున జీవో 64 అమలును నిలిపివేయాలని, ఇప్పుడు చెల్లిస్తున్న విధంగానే జిల్లా కలెక్టర్ కనీస వేతనాల సర్కులర్ గెజిట్ ప్రకారం విధిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 64తో తగ్గుతున్న వేతనాలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచవలసిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా 2021లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 64ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వలన గిరిజన కార్మిక వేతనాలకు నెలకు 4వేల నుండి 15 వేల వరకు తగ్గుతున్నాయని, ఫలితంగా ఖమ్మం జిల్లాలో ఒక్కొక్క వర్కర్‌కు సుమారుగా 45వేల నుండి లక్ష రూపాయల వరకు నష్టపోతున్నారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి తక్షణమే స్పందించి న్యాయమైన పోరాటం చేస్తున్న హాస్టల్ కార్మికులకు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్మికులు బానోతు భద్రమ్మ, కోటమ్మ, బాలి, నాగేశ్వరరావు, వెంకట్రావ్, శాంతి, కౌసల్య, పద్మ, బాలసింగ్, కృష్ణ, శ్రీను, రమేష్, పాల్గొన్నారు.

# కుక్కలు.. బాబోయ్ కుక్కలు..!

**-వీధి శునకాలు, కోతులు వీరంగం**
**-భయపడుతున్న ప్రజలు**





**ప్రజాపక్షం/వైరా :** ఇంట్లో నుంచి బయటికి వస్తుంటే బాబోయ్ కుక్కలు కోతులు అంటూ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు కోతులతో వృద్ధులు, చిన్నారులు ప్రతిఒక్కరూ భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడిచిన 20 రోజుల వ్యవధిలో వైరా మున్సిపాలిటీలో, మండలంలో కుక్కలు దాడి చేసిన సంఘటన మరకవ ముందే వారం రోజుల క్రితం గండగలపాడు గ్రామంలో వృద్ధురాలిపై కోతులు దాడి చేసిన ఘటన కూడా ఉంది. మున్సిపాలిటీలోని కుక్కలు పలు ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ గుంపులుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట కాలినడకన వెళ్లే వారు కుక్కలను చూసి ఆగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అని ఎప్పుడు ఏ విధంగా దాడి చేస్తాయో తెలియక భయపడాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలు వెంబడి కూడా కుక్కలు పడుతున్నాయి. దీంతో వాహనాలు అతివేగంగా నడపుపోయి క్రింద పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కుక్కలు కనబడితే ఒంటరిగా వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉదయం వేళ స్కూల్ బస్సుల కోసం విద్యార్థులు వేచి ఉంటున్న సందర్భంలో కుక్కల గుంపును చూసిన విద్యార్థులు భయపడుతున్నారు. పెంపుడు కుక్కలు సైతం ఇళ్లకు వెళ్లిన వారిపై దాడియి ప్రయత్నిస్తున్నాయి. కుక్కలను పెంచుకునే వారు వాటికి పశు వైద్యుల ద్వారా వైద్యసేవలు అందించి వ్యాక్సిన్ కూడా వేయించాలి. కుక్కలు కనబడ్డ వారి పికెల్ సైతం పీకేస్తున్నాయి. వీధి సునకాలు, కోతులు రోడ్లపై వీరంగం వేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

## జియోథర్మల్ ప్రాజెక్టును పరిశీలించిన డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ అధికారి



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, ఓఎన్‌జిసి డైరెక్టర్ ఆఫ్ జనరల్ సునీల్ కుమార్, జనరల్ మేనేజర్ ఎస్ ఎస్. మాయల్, జనరల్ మేనేజర్ కిరణ్ తో కలిసి ఆదివారం పగిడేరు గ్రామంలో జీవధర్మన్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ పర్యటనలో ముందుగా డైరెక్టర్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పగిడేరు సింగరేణి జియో థర్మల్ విద్యుత్ ప్లాంట్ సందర్శించారు. ప్రస్తుతం ఉత్పత్తి సామర్థ్యం 20 కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్య పెంపుకు అవకాశాలు పరిశీలించాలని సంబంధిత అధికారులతో సమాలోచనలు జరిపారు. అనంతరం డైరెక్టర్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులతో పీకే ఓసి 2 గనిని వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను సందర్శించారు. భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా ఓపెన్ కాస్ట్ గనులలో చేరే వర్షపు నీరుని బయట పంపే విధంగా ముందస్తు చర్యలు చేపట్టి సరిపడే మోటర్లు కండిషన్లు ఉండేలా సంబంధిత బాధ్యులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, బొగ్గు రవాణాకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు లేకుండా తగుచర్యలు చేపట్టాలని అధికారులను వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం దుర్గం రాంచందర్, జిఎం కనకయ్య, జిఎం శ్రీనివాస్, ఏజిఎం పంకజ్ , శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ బి. శ్రీనివాస్, ఇన్చార్జి ప్లానెట్ ఆఫీసర్ వీరభద్ర రావు, ఎస్ఓ టూ జిఎం బి. శ్రీనివాస్ , ఆర్అండ్‌బడి జనరల్ మేనేజర్ కనకయ్య, ఎక్స్‌ప్లోరేషన్ జనరల్ మేనేజర్ బి.ఎస్. రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ పీకే ఓసి వీరభద్రుడు, పీకే ఓసి 2 మేనేజర్ సురేష్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె. శ్రీనివాస్, ఏరియా సర్వే ఆఫీసర్ దయాకర్, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ బబ్బుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియూసి మిత్రపక్షాలు వినూత్న నిరసన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఎన్నికల ముందు యాజమాన్యం గుర్తింపు సంఘం కుమ్మక్కై సంవత్సరం క్రితం భూమి పూజ చేసిన ఇండోర్ షటిల్ కోర్ట్ పిచ్చి మొక్కలతో బురదమయంగా ఉన్న ప్రదేశంలో షటిల్ ఆడుతూ ఐఎన్‌టియుసి మిత్రపక్షాల నాయకులు వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి మిత్రపక్షాల ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం కార్మికులను మభ్యపెడుతూ ఆనాడు శంకుస్థాపన చేసిన ఇండోర్ షటిల్ కోర్టు అంతర్జాతీయ ప్రమాణాలతో గుర్తింపు సంఘం కట్టించిన ఇండోర్ షటిల్ కోర్టు యావత్ ప్రపంచం గర్వించే స్దాయిలో ఉందని చెప్పటానికి ఈ బురద పిచ్చి మొక్కలే నిదర్శనమని అన్నారు. కావున కార్మిక సోదరులు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని, ఇది ముమ్మాటికి గుర్తింపు సంఘం ఎన్నికల స్టంట్ అని, దీనికి వత్తాసు పలుకుతున్న మార్వాడి ముసుగులో కార్పొరేట్ యాజమాన్యం ఇకనైనా సిగ్గు తెచ్చుకుని పనులు ప్రారంభించాలి యాజమాన్యానికి కోరుతున్నామన్నారు. అదే విధంగా 29 కార్మిక కుటుంబాలను ఖాళీ చేయించే శ్రద్ధ కట్టే దానిలో చూపించాలన్నారు. గుర్తింపు సంఘాన్ని యాజమాన్యన్నీ ఐఎన్‌టియూసి మిత్రపక్షాల ద్వారా మేము కోరేది ఒకటే నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరిన కాలనీని కార్మికులకు ఎలా కేటాయిస్తారని, డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీలోకి డ్రైనేజ్, వర్షపు నీరు ప్రవేశించి అధ్వానంగా ఉండి, రిపేర్ చెయ్యటానికి కూడా పని చెయ్యవని ప్రక్కకు పెట్టిన కోటర్స్‌ను ఈ రోజు కార్మికులకు ఎలా కేటాయిస్తారని అన్నారు. కొత్త క్వాటర్స్ నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదని కోటర్స్ నిర్మాణం జరిగే వరకు ప్రతిదానికి ఐటిసి కుటుంబం, మనమంతా ఒక ఫ్యామిలీ అనే యాజమాన్యం తాత్కాలికంగా అయిన మెనేజర్స్ కాలనీలో ఖాళీగా ఉన్న కాలనీలోకి షిఫ్ట్ చెయ్యాలని లేదా మీకు చిత్తశుద్ధి ఉంటే త్వరతగతిన ఒక బ్లాక్ పూర్తి చేసి ఒక 30 మందిని సీనియర్లను అక్కడికి తరలించి ఖాళీ అయిన వాటిల్లో ఈ కార్మికులకు కేటాయించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. గుర్తింపు సంఘానికి ఒకటే హెచ్చరిస్తున్నామని కేవలం మీ పబ్లిసిటీ స్టంట్ కోసం, మీ ఫోటోలకు ఫోజుల కోసమే కార్మికులను బలి చెయ్యొద్దని ఆరోపించారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టియూసి మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిఆధ్వర్యంలో సేవా పక్వాడ్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సాయి గణేష్‌నగర్‌లో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంరూరల్ మండల శాఖ సేవా పక్వాడ్ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు జాటోత్‌మధు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని, సెప్టెంబర్ 17నుండి అక్టోబర్ 2వరకు చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సేవా పక్వాడ్ జిల్లా కన్వీనర్ నల్లమాసు శ్రీనివాస్, దళితమోర్చ జిల్లా అధ్యక్షులు కోటమర్తి సుదర్శన్, నాయకులు కన్నేటి కోటయ్య, భానీయనాయక్, పృథ్వీ, హలావత్ సురేష్, సత్తి నాగరాజు, హిరాల రాథోడ్, గుండె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తలతో రైతులకు నష్టం..!

**-బెంబేలెత్తుతున్న రైతన్నలు**
**-రాత్రి వేళల్లో మిరపపై నత్తల దాడి**
**-అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి**





**ప్రజాపక్షం/పినపాక:** పంటలపై కోతులు, ఎలుకలు, మిడతలు ఆఖరికి సీమలు దాడి చేయడం చూశాం..విన్నాం.. ఎప్పుడైనా నత్తలు దాడి చేయడం విన్నామా.. పినపాక మండలంలో ఇప్పుడిదే సమస్యగా మారింది. నత్తలు గుంపులు, గుంపులుగా దండెత్తుతున్నాయి. ఇళ్లు, వాకిళ్ల తోపాటు పంటలపైనా దాడి చేస్తున్నాయి. మిరప తోటలు సాగుచేసిన రైతులపాలిట ఈ ఏడాది నత్తలు శాపంలా మారింది. మండలంలోని చింతల బయ్యారం, వెంకట్రావ్ పేట, పాతరెడ్డి పాలెం, దుగినేపల్లి, ఏడూళ్ల బయ్యారం, సింగిరెడ్డిపల్లి పలు గ్రామాల్లో మిరప తోటల్లో గుంపులుగా నత్తలు సంచరిస్తున్నాయి. అవి మొక్క దశలోనే కాండాన్ని తొలుస్తుండటంతో రెండు నుంచి మూడు రోజులల్లోనే మొక్కలు వడలిపోతున్నాయి. వర్షం వస్తే ఉదయాన్నే పొలానికి వెళ్లి చూసేసరికి సాళ్లల్లో ఎక్కడచూసిన నత్తలే కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పగటిపూట కనిపించని నత్తలు రాత్రి సమయాల్లో తోటల్లోకి ప్రవేశిస్తున్నాయి. డ్రిప్పులు అమర్చిన పొలాల్లో మల్చింగ్ షీట్ కిందకు చేరిమొక్క మొదళ్లను నాశనం చేస్తున్నాయి. మరోవైపు డ్రిప్ లేటర్లలోకి నత్తలు వెళ్లడంతో పైపుల్లో నీళ్లు రాకుండా బ్లాక్ అవుతున్నాయి. ఉదయం పూట ఓ తోట నుంచి మరో పొలంలోకి పాకిపోతున్నాయి. ఇవి జిగటలాంటి ద్రవాన్ని విసర్జిస్తూ వెళుతున్నట్టు రైతులు చెబుతున్నారు. గత ఏడాది అక్కడక్కడా కనిపించిన నత్తలు ఈసారి వేల సంఖ్యలో తోటలపై పడి సర్వనాశనం చేస్తున్నాయని రైతన్నలు వెల్లడిస్తున్నారు. వీటి నివారణకు రైతులు రకరకాల పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. మిరప తోటలకు గతంలో వైరస్ తెగుళ్లుసోకేవి. అలాగే గత ఏడాది ధర తక్కువ ఉండటంతో రైతన్నలకు నష్టాలను చవిచూడటంతో ఈ ఏడాది పంటవిస్తీర్ణం తగ్గినప్పటికీ రైతులను ప్రస్తుతం నత్తలు నష్టపరుస్తున్నాయి.ఈ ఏడాది వర్షాలు అధికంగా కురుస్తున్నందున నత్తలు అధికంగా పొలాల్లో తిరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి వీటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని రైతన్నలు కోరుతున్నారు.


**నష్టపోతున్నాం : పొనగంటి శివకృష్ణ, చింతల బయ్యారం యువరైతు**



నాలుగు ఎకరాల్లో మిరప సాగు చేశాను. నత్తల బెడద అధికంగా ఉంది వాటి నివారణకు రకరకాల పురుగు మందులు పిచికారి చేయడంతో పాటు బి య్యంలో మందును కలిపి కొన్నిసార్లు చల్లాను. మొక్కదశలోనే నత్తలు బెడదతో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఇప్పటికి మూడుసార్లు చావు మొక్కలు వేశాం

# ఫంక్షన్ హాల్స్ భద్రమేనా..?

**- అనుమతులు ఉన్నవి ఎన్ని? లేనివి ఎన్ని ?**
**- ఇష్టారీతిన నిర్మాణాలు**
**- ప్రభుత్వ ఆదాయానికి గండి**
**- మామూళ్ల మత్తులో అధికారులు**
**- మండిపడుతున్న ప్రజలు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఒకప్పుడు ఫంక్షన్‌హాల్లో శుభకార్యాలు ధనవంతులు మాత్రమే చేసుకొంటారనేది. నేడు కాలం మారింది. రోజులు మారాయి. అభిరుచులు మారాయి. తమ స్టేటస్‌ను చూపించుకోవటానికి తహతహలాడుతున్నారు. దీనితో ప్రతీ శుభకార్యాన్ని ఫంక్షన్ హాల్స్‌లో చేయటానికే మొగ్గుచూపుతున్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాలలో విచ్చల విడిగా ఫంక్షన్ హాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. పిల్లల బారసాల, ఓణీల ఫంక్షన్, పుట్టిన రోజు తదితర ఏ చిన్న శుభ కార్యాలైనా ఫంక్షన్ హాల్స్‌నే ఆశ్రయిస్తున్నారు. దీనినిఆసరా చేసుకొంటున్న బడాబాబులు కొందరు తమ డబ్బు పలుకుబడితో అనుమతులు లేకుండానే ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తున్నారు. ప్రభుత్వాదాయాన్ని లక్షల్లో కొల్లగొడుతున్నారు. పాల్వంచ మున్సిపాలిటిలో విచ్చల విడిగా ఫంక్షన్ హాల్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ అనుమతులను, నిభంధనలను భేఖాతర్ చేస్తూ ధర్జాగా నిర్మిస్తున్నారు. అధికారుల కళ్ళెదుటే బహుళ అంతస్థుల నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోకపోవటంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం పాల్వంచ మున్సిపల్ పరిధిలో కేవలం ఐదు ఫంక్షన్ హాల్స్‌కే అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో కేవలం ఒకే ఒక్క దానికి మాత్రం అన్ని అనుమతులున్నాయని తెలుస్తోంది.

**అనుమతులు :**

మున్సిపల్ పరిధిలో కమీషనర్, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పంచాయితీ అధికారుల అనుమతులు తీసుకోవాలి. అలాగే ఫైర్ సేఫ్టీ అధికారుల అనుమతి తప్పని సరి ఉండాలి. 500 గజాది. ప్రభుత్వాదాయాన్ని ఎగ్గొడుతున్న యాజమానులకు కొమ్ముకాస్తూ వారిచ్చే కాసులకుకక్కుర్తి పడుతున్న అధికారులు చర్యలు తీసుకోవటానికి వెనుకాడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి రోజుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా పట్టణం నడి బొడ్డున ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు పుచ్చుకొని అనధికార అనుమతులు జారీ చేశారంటూ సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున చర్చలు సాగుతుండటం విశేషం. అట్టి ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సంభందించిన అధికారిక వివరాలు మున్సిపాలిటీలో లేవని అధికారులిచ్చిన సమాచారంతో బయటపడింది.

**పన్నుల వసూలు :**

పాల్వంచలో గల 8145/1 నెంబర్ గల వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌కు రూ.13,788/లు, 3296/13 తానస్ గ్రాండ్ కు రూ.2,20,836/లు, 201ఇన్ 0001హెచ్ కన్వెన్షన్ హాల్ రూ.1,51,537/లు, 22185/15 సుగుణ గార్డెన్ రూ.2, 00,654/లు, లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ 221184 కు రూ. 52,728/లు చొప్పున మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావలసిన దిగమింగుతున్నవారి వెనుక ఉన్న అధికారులెవరో అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

**వాణిజ్య పన్నులకు బదులు సేవా రుసుము వసూలు :**

గ్రామీణ ప్రాంతంలోని జగన్నాధపురం, కేశవాపురం గ్రామాలలో వెలసిన ఫంక్షన్ హాల్స్‌లో ఏ ఒక్కదానికి అధికారులు అనుమతులు లేవని తెలుస్తోంది. వీటికి వాణిజ్య పన్నులకు బదులుగా కేవలం సేవా రుసుము పేరుతో నామ మాత్రపు పన్నులు వసూలు చేస్తున్నారు. దీనితో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. ఈ విషయంపై జిల్లా పంచాయితీ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని కోరుచున్నారు.

**లేని ఫైర్ సేఫ్టీ :**

అధికారిక లెక్కల ప్రకారం పట్టణంలోని ఉన్న నాలుగింటిలో మూడు ఫంక్షన్ హాల్స్‌కు ఫైర్‌సేఫ్టీ అనుమతులు లేవని అధికారులుచ్చిన సమాచారం, ఇది అధికారిక లెక్కల ప్రకారం మాత్రమే లెక్కలేనివి ఉన్నవి ఎన్నో. నిత్యం వందలాది మందితో కళకళలాడే ఫంక్షన్ హాల్స్‌లో ప్రజల ప్రాణాల భద్రత భద్రమేనా అనే ఆందోళనలు, సందేహాలు వ్యక్తమవుతున్నారు. పట్టణంలో పుట్టగొడుగుల్లా వెలసిన ఫంక్షన్‌హాల్‌లో అనుమతులు లేని వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని పలువురు అంటున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదాలు సంభవిస్తే భయటపడే సరైన మార్గాలు కూడా లేవని అంటున్నారు. భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తగు నిభంధనల మేరకు అన్ని పన్నులు వసూలు చేసి, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేటట్లు దృష్టి సారించి ప్రజల ప్రాణాల భద్రతకు భరోసా కల్పించాలంటున్నారు.

**- కార్యదర్శి వివరణ :**

ఈ విషయంపై జగన్నాధపురం గ్రామ పంచాయితి కార్యదర్శి చెన్నకేశవులు వివరణ కోరగా అన్ని ఫంక్షన్‌హాల్స్‌కు అనుమతులు ఉన్నాయని అన్నారు. కమర్షియల్ ట్యాక్సీకి బదులు సేవా రుసుము వసూలు చేస్తున్నమని చెప్పారు.

## మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** షెడ్యూల్ట్ క్యాస్ట్ ఏరియాలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ పెద్దిని వేణు అన్నారు. ఆదివారం స్థానిక సమస్యలు ఉన్న దగ్గరే కూర్చోని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు నిధులు కేటాయింపు చేస్తున్నారని, ఒక పక్క చెబుతూనే దళిత కాలనీలలో సమస్యలు ఉన్నాయని, గుర్రాయిగూడెం రోడ్డు, వాడపల్లి వారి వీధి, దడిగల దుర్గమ్మ గారి వీధి డ్రైనేజీకి ఎత్తుగా పోయడం జరిగిందని దానికి ఇరువైపులా వాహనాలు రావడానికి పోవడానికి ఇబ్బందిగా ఉందని, కొంత మంది బండ్లపై నుండి క్రింద పడి దెబ్బలు కూడా తగిలాయని, వెంటనే దానికి ఇరువైపులా కాంక్రీట్‌తో నింపాలని, డ్రైనేజీ నిర్మాణం చేసినప్పటికీ డ్రైనేజీలో నుండి చుక్క నీరు కూడా పోవట్లేదని, వర్షం వస్తే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రాయి రాజ పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ ర్యాలీకి భారీగా కదిలిన లంబాడీలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెంలో ఆదివారం జరిగిన ఆత్మగౌరవ ర్యాలీకి పాల్వంచ మండల వ్యాప్తంగా లంబాడీలు భారీగా కదిలారు. ముందుగా కేటిపిఎస్ సి కాలనీ గేటు దగ్గర నుండి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ మీదుగా అంబేద్కర్‌సెంటర్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆదివాసీలు, లంబాడీ సామాజికి వర్గాలు అన్నదమ్ముల వలె కలిసి ఉంటున్నారని అన్నారు. కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవటానికి ఆదివాసీలను లంబాడీలపైకి ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. లంబాడీలను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలని కోర్టుకు వెళ్ళటం దుర్మార్గమని మండిపడ్డారు. ఇకనైనా అలాంటి ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. లేదంటే లంబాడీ సామాజిక వర్గాల ఆగ్రహానికి గురికావలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు ఉపేందర్ నాయక్, భట్టు మంజుల, కుశనాయక్, భరత్, భద్రు నాయక్, పరమేష్, నందిని, రమేష్, రాము నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్ సహకారంతో సయ్యద్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ముందుగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. గెలు పొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సంధర్భంగా అరుణ కుమారి, షాహనాజ్ ఖాన్‌లు మాట్లాడుతూ దేవనాగరి లిపిలో ఉన్న హిందీ భాషను దేశ అధికార భాషగా గుర్తించిన తరువాత ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 14వ, తేదీన జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకొంటారని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ ను యూత్ క్లబ్ సబ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, డి. రమేష్,వేముల కామేశ్వరరావు, కొండలరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, శెట్టి స్వరూపరాణి, శ్రీదేవి, పొట్లపువ్వ శ్రీనివాసరావు, దీపిక, విమల తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా మారిన పెద్దమ్మతల్లి దేవాలయం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మద్యన కొలువై ఉన్న (శ్రీ కనకదుర్గ) పెద్దమ్మతల్లి దేవాలయం ఆదివారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో సందడిగా మారింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు .ఒడిబియ్యం, చీరలు, కనుములు తదితర మొక్కులు చెల్లించుకొన్నారు. దేవాలయ ఆవరణంలోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి అభిషేకాలు జరిపించారు. దేవస్థానం ఆద్వర్యంలో క్యూలైన్‌లో భక్తుల కోసం ఉచిత పులిహోర వితరణ, మంచినీటి వసతి కల్పించారు.

**- నేడే టెండర్ బహిరంగ వేలం...**

దేవస్థానంకు చెందిన షాపులను, చీరలు ప్రోగు చేసుకొనే లైసెన్స్ హకుల్కు, పూలు, పూల దండలు అమ్ముకొనుటకు లీజులు, లైసెన్స్ హక్కులు పొందటానికి నేడు దేవాలయ ఆవరణంలో టెండర్ కం బహిరంగ వేలములను నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.200/లు చెల్లించి షెడ్యూల్ పొందాలని, నిభంధనల మేరకు డిడిజతపరిచి టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు. అలాగే ఆలయంలో పులిహోర, లడ్డూ ఇతర ప్రసాదములను తయారు చేసేందుకు ఆలయాల్లో పని చేసిన అనుభవం కలిగిన బ్రాహ్మణులు కావాలని, ఆసక్తి కలిగిన వారు ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

# పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పంపిణీ



ప్రజాపక్షం/ ఖమ్మం : పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోటరీక్లబ్ సహకారంతో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా ఆదివారం కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. పువ్వాడ 87వ జన్మదినోత్సవ సందర్భంగా 87 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలు అందించేందుకు రూ. 348000 రోటరీ ట్రస్ట్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పువ్వాడను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు మల్లాది వాసు, కనకం జనార్ధన్, మమత డైరెక్టర్ పువ్వాడ నరేన్, వల్లభనేని రామారావు, రామారావు, సాంబశివరావు, జగన్నాథం, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

**-ఘనంగా పువ్వాడ జన్మదిన వేడుకలు**



**ఘనంగా పువ్వాడ జన్మదినం :**

సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ 87వ దినోత్సవ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, పువ్వాడ అభిమానులు, బంధుమిత్రులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 87 వసంతాలను పూర్తి చేసుకున్న పువ్వాడ 88వ వసంతంలోకి అడుగుపెట్టారు. విద్యార్థి దశ నుంచి సామాజిక అవగాహన కలిగిన పువ్వాడ కమ్యూనిస్టు పార్టీలో అంచలంచెలుగా ఎదిగారు. శాసన మండలి సభ్యులుగా, శాసన సభ్యునిగా పని చేసిన పువ్వాడ విశిష్ట సేవలు అందించారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

# వనజీవి జీవిత పుస్తకావిష్కరణ



ప్రజాపక్షం/ ఖమ్మం : వనజీవి రామయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని కాళోజీ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి సీతారాం తెలిపారు. ఖమ్మం జిల్లాకు పద్మశ్రీ అవార్డు తెచ్చిన వనజీవి రామయ్య చరిత్రను పుస్తకంగా మలిచి అందించిన రచయిత నరేష్ జిల్లా అభినందనీయుడన్నారు. అక్షరాల తోవ సాహితి సంస్థ ఆధ్వర్యంలో నరేష్ జిల్లా రచించిన విత్తనం నుండి మహా వృక్షంగా వనజీవి జీవిత పుస్తకావిష్కరణ ఆదివారం ఖమ్మం ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసభలో సీతారాం మాట్లాడుతూ ఆరేండ్లుగా రచయిత నరేష్ వనజీవి రామయ్యను అనుసరించి అనేక విషయాలను తెలుసుకుని పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రచయిత నరేష్ జిల్లాను అతిథులు సన్మానించారు. సామాజిక సేవకులు కడివెండి వేణుగోపాల్, ప్రముఖ కవులు, రచయితలు అట్లూరి వెంకటరమణ, సైదులు అయినాల, నయూమ్ పాషా, వూరిమళ్ల సునంద ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రామయ్య సతీమణి జానకమ్మ, అక్షరాల తోవ నిర్వాహకులు నామ పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, సయ్యద్ షఫీ, కన్నెగంటి వెంకటయ్య, ఎంవి రమణ, కొండ్రు బ్రహ్మం, నాగ మోహన్, అమ్మఒడి బాబు, కళాకారులు మొగిలి, నాగసాయి తదితరులు పాల్గొన్నారు. పమ్మి రవి, వెంకన్న, బద్ర, గోవింద్, కృష్ణ పాడిన పాటలు సభికులను అలరించాయి.


# హిడ్మాను మట్టుపెట్టేందుకు ప్రత్యేక బలగాలు

**- తమ రాడర్ పరిధిలోనే ఉన్నట్లు చెప్పిన సిజి పోలీసులు**

**- పోలీసుల అదుపులో హిడ్మా ఉన్నట్లు పలు అనుమానాలు**

**- భద్రతా బలగాల ఆధీనంలోకి కర్రెగుట్ట అడవులు**

**- ప్రత్యేక బేస్‌క్యాంపు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ః మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు, తాజా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, మిలటరీ చీఫ్ మడవి హిడ్మాను మట్టుపెట్టేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు ముమ్మర వేట కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బస్తర్ రేంజీ ఐజి సుందర్ రాజన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. హిడ్మాను త్వరలో మట్టుపెడతామని, ఆయన తమ రాడర్ పరిధిలోనే సంచరిస్తున్నట్లు తమ వద్ద పక్కా సమాచారం ఉందని ఆయన మీడియాకు అందించిన సమాచారం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే హిడ్మాను భద్రతా బలగాలు పట్టుకుని సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయా.... తమ ఆదీనంలో పెట్టుకుని మావోయిస్టుల కదలికలు, కొత్త ఎత్తుగడలు, నూతన కమిటీ ఎంపిక, ఎవరెవరు సమావేశాల్లో పాల్గొంటున్నారు, ఎక్కడ తలదాచుకుంటున్నారనే విషయాలు రాబట్టే పయత్నం జరుగుతుందా అనే అనుమానాలు విప్లవోద్యమ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో హిడ్మా అంత్యంత చాకచక్యంగా తప్పించుకున్నట్లు అక్కడి పోలీసులే స్వయంగా వెల్లడిస్తున్నారు. కాగా ఆయన కోసం ప్రత్యేక బలగాలు వేట కొనసాగిస్తున్నాయని, త్వరలో మట్టుపెడతామని పోలీసులే చెప్పడం ద్వారా మావోయిస్టుల ఉనికిని మరింత ఇరకాటంలో పడేసి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకా, లేక నిజంగానే ఎన్ కౌంటర్ చేస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా మావోయిస్టు కేంద్రకమిటీ కార్యదర్శిగా తిప్పరి తిరుపతి, అలియాస్ దేవ్‌జీ తో పాటు హిడ్మ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా, మిలటరీ చీఫ్‌గా మావోయిస్టు పార్టీ ఎంపిక చేసిన విషయం విధితమే. ఎంపికైనా అతి కొద్దిరోజుల్లోనే హిడ్మాను అతి త్వరలో మట్టుపెడతామంటూ పోలీసులు చెప్పడం విశేషం. ఇదిలా ఉండగా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు పార్టీ లేకుండా చేస్తామని కేంద్ర హోమ్‌శాఖా మంత్రి అమీత్‌షా ఇప్పటికే పలు మార్లు చెప్పిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కర్రెగుట్టలను పూర్తిగా భద్రతా బలగాలు తమ ఆదీనంలోకి తీసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో సమాంతర పాలన సాగించిన మావోయిస్టు పార్టీ అక్కడ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇప్పటి వరకు జరిగిన పలు ఎన్‌కౌంటర్లలలో కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో సహా కేంద్ర, రాష్ట్ర కమిటీ క్యాడర్‌కు చెందిన పలువురు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు పార్టీని పూర్తిగా ఛత్తీస్‌గఢ్‌లో లేకుండా చేసేందుకు కర్రెగుట్టల్లో ప్రత్యేక బేస్ క్యాంపు ఏర్పాటు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే 700 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేయడంతో పాటు బలగాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రోడ్డు వేసేందుకు కూడా అనుమతులు ఇచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసే శాశ్వత క్యాంపులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మావోయిస్టులను ధీటుగా ఎదుర్కొనేందుకు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలను స్వాదీనం చేసుకోవడం ద్వారా మావోయిస్టుల నియంత్రణకు కేంద్ర హోమ్‌శాఖ సరికొత్త వ్యూహాలు పన్నుతున్నట్లు అర్థమవుతోంది.

# త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రజాపక్షం/ఖమ్మం : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఖమ్మంలోని బుర్హాన్‌పురంలోని త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం నుండి శ్రీకృష్ణుడు ప్రజలకు జ్ఞానాన్ని అందించాడని తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతమన్నారు. కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయటపడవచ్చునని తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో సేవా సమితి ఖమ్మం కమిటీ అధ్యక్షులు సత్యం, సభ్యులు ఉమేష్, విజయ, సుజాత, వినురాధ, అరుణ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజ్ సంస్థ ద్వారా వస్తువుల వితరణ



ప్రజాపక్షం/ తల్లాడ : సన్‌రైజ్ అభ్యుదయ సేవా సంస్థ ద్వారా రూ. 10వేల విలువ గల వస్తువులను గొల్లగూడెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేశారు. సన్‌రైజ్ సంస్థ ఉపాధ్యక్షులు ఏనుగు శివరాఘవ తండ్రి సురేష్ జన్మదిన సందర్భంగా ఈ వస్తువులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బేబీ చైర్స్, బాలింతలకు కుర్చీలు, కేంద్రానికి నీళ్ల క్యాన్లు మొదలైన వాటిని అందించారు. ఈ సందర్భంగా తల్లాడ ఎంపిడివో సురేష్‌బాబు మాట్లాడుతూ సంస్థ పనితీరు అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఇటువంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్, ఉపాధ్యక్షులు ఏనుగు శివరాఘవ, సంస్థ బాధ్యులు ఏనుగు కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులను కొట్టిన వంట మనిషి

**-వర్షంలో కబడ్డీ ఆడుతున్నారని నెపంతో విద్యార్థులను చితకబాదిన వైనం**

ప్రజాపక్షం/పెనుబల్లిః పెనుబల్లి మండల కేంద్రంలోని వి ఎం బంజర్ ఎస్సీ హాస్టల్ కు చెందిన వంట మనిషి శుక్రవారం చితకబాదాడు. సంఘటన ఆలస్యం గా వెలుగు లోకి వచ్చింది.. వివరాలు ఇలా ఉన్నాయి... సెలవు దినం కావడంతో విద్యార్థులు ఆవరణలోని ఆటలాడుకుంటున్నారు. ఇది గమనించిన వంట మనిషి బురదలో ఆటలాడుతున్నారంటూ కర్ర పుచ్చుకొని విద్యార్థులను చితకబాదాడు. కొందరు విద్యార్థులకు మొహంపై వీపుపై వాతలు తేలాయి. వంట మనిషి చేతిలో దెబ్బల తిన్న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్ చేసి రప్పించుకున్నారు. పిల్లల ఒంటిపై దెబ్బలు చూసి విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మందలించకుండా కర్ర తీసుకొని ఇష్టం వచ్చినట్లు కొట్టడం ఏమిటని వాపోతున్నారు. విద్యార్థులపై వంట మనిషి చేయి చేసుకోవడం పట్ల ఎస్సీ హాస్టల్ వార్డెన్ బజ్జురి వెంకటేశ్వరావును చరవాణి ద్వారా ప్రశ్నించగా విద్యార్థులను విచారించి వంట మనిషి పై చర్య తీసుకుంటానని హాస్టల్ వార్డెన్ తెలిపారు.

# వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

ప్రజాపక్షం/ బోనకల్ : వ్యభిచార కేంద్రంపై పోలీసులు దాడి చేసిన ఘటన ఆదివారం మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో చోటు చేసుకుంది. నిమ్మతోట మంగమ్మ అనే మహిళ ఆమె ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుందని సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, బోనకల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో ఒక విటుడు , బాధిత మహిళతో పాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

# రివర్స్ చేస్తున్న కారును ఢీకొన్న వ్యక్తి

**-తీవ్ర గాయాలు**



ప్రజాపక్షం/సత్తుపల్లిః రివర్స్ చేస్తున్న కారును వెనుక నుంచి ఢీ కొట్టిన వ్యక్తి తీవ్రంగా గాయ పడిన సంఘటన సత్తుపల్లి మండలం సదాశివుని పాలెం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసు కుంది. సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామ శివారులో గ్రీన్ ఫీల్డ్ హైవే సమీపంలో రివర్స్ చేస్తున్న కారును భీమవరం గ్రామానికి చెందిన పంతంగి సుబ్బారావు వెనకవైపు నుంచి ఢీ కొన్నాడు. దీంతో సుబ్బారావుకు తీవ్ర గాయపడగా స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సత్తుపల్లి 108 సిబ్బంది (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) గొల్లమందల కృష్ణ పైలట్ ఏ కాంత్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన సుబ్బారావుకు అక్కడే ప్రథమ చికిత్స నిర్వహించి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన సత్తుపల్లి 108 సిబ్బందిని వాహనదారులు భీమవరం, సదాశివుని పాలెం, గ్రామాల ప్రజలు అభినందించారు. 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి.శివకుమార్ 108 అంబులెన్స్‌లో క్షణాల్లో అందుబాటులో ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటామనిఆయన తెలిపారు.